క్లుప్తంగా

ఆస్పత్రిలో బాలిక మృతిపై ఆందోళన

అమలాపురం టౌన్: వైద్య వికటించి బాలిక (4) మృతి చెందిందని ఆరోపిస్తూ ఆమె కుటుంబీకులు, బంధువులు శనివారం అమలాపురంలోని ప్రైవేటు ఆస్పత్రి వద్ద శనివారం నిరసన తెలిపి వైద్యులపై కేకలు వేశారు. పశ్చిమ గోదావరి జిల్లా నడిపూడికి చెందిన బాలిక మృతి చెందింది. జలుబు, వాంతులతో బాధ పడుతున్న బాలికను ఆమె కుటుంబీకులు శుక్రవారం ఉదయం ఆస్పత్రిలో చేర్పించారు. శనివారం మధ్యాహ్నం నుంచి బాలిక ఆరోగ్యం విషమించి మృతి చెందింది. అనంతరం బాలిక కుటుంబీకులు, బంధువులు ఆస్పత్రి వద్ద నిరసన తెలుపుతుండగా ఆస్పత్రి వర్గాలతో చర్చించారు. సమస్య పరిష్కారం కావడంతో వారు ఆందోళన విరమించారు. వైద్యుడు వీవీఎస్ఎస్ మూర్తి మాట్లాడుతూ బాలిక తీసుకున్న ఆహారం ఊపిరితిత్తుల్లోకి వెళ్లడంతో మృతి చెందిందని చెప్పారు.

కొత్త కూటమి ఏర్పాటుపై సమావేశం

యానాం: పుదుచ్చేరిలో అధికారంలో ఉన్న బీజేపీ, ఎన్ఆర్ కాంగ్రెస్ ఎన్డీఏ కూటమికి, కాంగ్రెస్, డీఎంకే ఇండియా కూటమికి వ్యతిరేకంగా మరో కొత్తగా మూడో కూటమి ఏర్పాటుకు శనివారం పుదుచ్చేరిలో ఓ ప్రైవేట్ హోటల్లో మాజీ, ప్రస్తుత ఎమ్మెల్యేలు రహస్యంగా సమావేశం కావడం సర్వత్రా చర్చనీయాంశమయ్యింది. ఎమ్మెల్యే నెహ్రూ, మాజీ ఎమ్మెల్యేలు హసన, స్వామినాథన్, దివంగత స్పీకర్ కుమారుడు విఘ్నేష్‌కన్నన్ పలువురు పాల్గొని కూటమి ఏర్పాటుపై చర్చించారు. వీరంతా సినీనటుడు విజయ్ ఏర్పాటుచేసిన కొత్తపార్టీతో కలిసి వెళ్తారని పలువురు భావిస్తున్నారు.

ఎస్పీని కలిసిన మహిళా పోలీసులు

అమలాపురం టౌన్: జిల్లాలోని వార్డు, గ్రామ సచివాలయాల మహిళా పోలీసులు స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ రాహుల్ మీనాను శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. విధి నిర్వహణలో భాగంగా సర్వే చేసేందుకు ఇళ్లకు వెళుతున్నప్పుడు కొందరు స్థానికంగా లేకపోవడం వల్ల లక్ష్యం పూర్తి కావడం లేదని మహిళా పోలీసుల ప్రతినిధులు ఎస్పీకి తెలిపారు. మహిళా పోలీసుల ప్రతినిధులు వడ్డి బేబీకుమారి, ఎం.నీలమ ప్రియ తదితరులు పాల్గొన్నారు.

పాన్‌షాప్‌లో మద్యం సీసాల స్వాధీనం

యానాం: స్థానిక బైపాస్ రహదారిలో ఓ పాన్ షాప్‌లో తనిఖీ చేసి మద్యం అనధికారికంగా విక్రయిస్తున్న వ్యక్తిని శనివారం యానాం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా గొల్లపల్లి రవి పాన్‌షాప్‌లో నిల్వ ఉంచి, విక్రయిస్తున్న 151 మద్యం సీసాలను ట్రాఫిక్ ఎస్సై శేరు నూకరాజు ఆధ్వర్యంలో పోలీసులు దాడిచేసి పట్టుకున్నారు. నిందితుడిని స్టేషన్‌కు తరలించి, మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఏఎస్సైలు పట్టాభి, పోశియ్య పాల్గొన్నారు.

పొటాష్ లోపాన్ని గుర్తించండి

ఐ.పోలవరం: ఖరీఫ్ వరి క్షేత్రాల్లో పొటాష్ లోపం ఏర్పడుతోందని, రైతులు సకాలంలో గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విద్యాలయం, జిల్లా వ్యవసాయ సాంకేతిక సలహా (ఏరువాక) కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త, కోఆర్డినేటర్, డాక్టర్ ఎం.నందకిషోర్ తెలిపారు. ఐ. పోలవరం మండలం పాత ఇంజరంలో ఆయన మండల వ్యవసాయ అధికారి ఎం.వాణి, గ్రామ వ్యవసాయ సహాయకుడు, రైతులతో కలసి శనివారం వరి చేలను పరిశీలించారు. పొటాష్ లోప నివారణకు 10 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్‌ను పొలాల్లో చల్లాలని అన్నారు. నీటిలో కరిగే 'మల్టీకే'ను లీటరు నీటికి 10 గ్రాముల చొప్పున పిచికారీ చేయాలన్నారు.

బేరింగ్‌ల చోరీ కేసులో ముగ్గురి అరెస్ట్

ఉప్పలగుప్తం: ట్రాక్టర్ బేరింగ్‌ల చోరీ కేసుకు సంబంధించి ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్టు ఎస్సై సీహెచ్.రాజేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్.కొత్తపల్లికి చెందిన కోడూరు సుబ్బారావు గ్రామంలో ట్రాక్టర్ విడి భాగాల వ్యాపారం చేస్తూ ఇంటిని అదే గ్రామానికి చెందిన వాతాడ వెంకటేశ్వరరావుకు అప్పగించి సుబ్బారావు హైదరాబాదులో ఉంటున్నాడు. ఈ నెల 21న స్పేర్‌పార్టులు ఉన్న ఇంటి తలుపులు పగలగొట్టి ఉండడంతో దొంగతనం జరిగినట్టు వెంకటేశ్వరరావు గుర్తించారు. రూ.36 వేలు విలువచేసే 60 ట్రాక్టర్ బేరింగ్‌లు అపహరించినట్టు గుర్తించిన వెంకటేశ్వరరావు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్టు ఎస్సై తెలిపారు. చోరీకి గురైన 60 బేరింగ్‌లను ఆటోలో తరలిస్తుండగా శనివారం ఎస్.కొత్తపల్లిలో అడ్డుకుని యలమంచిలి శివరావు, లంకే బ్రహ్మాజీ, ఆదివారపుపేట గణపతిని అదుపులోకి తీసుకున్నామన్నారు. ఆటో సీజ్ చేసి నిందితులను అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్టు ఎస్సై రాజేష్ తెలిపారు.

డ్రెయిన్ సమస్య పరిష్కారం

అమలాపురం టౌన్: స్థానిక 7,8 వార్డుల సరిహద్దుల్లో నిర్మించిన డ్రెయిన్ ఆ కౌన్సిలర్ల మధ్య వివాదస్పదంగా తయారైంది. ఈ వివాదాస్పద ప్రాంతాన్ని మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్ కుమార్ శనివారం పరిశీలించారు. 7వ వార్డు కౌన్సిలర్ గండి హారిక ప్రతిపాదన మేరకు మున్సిపాలిటీ అక్కడ డ్రెయిన్ నిర్మించింది. ఈ విషయమై 8వ వార్డు కౌన్సిలర్, మున్సిపల్ వైస్ చైర్మన్ తిక్కిరెడ్డికి కనీస సమాచారం లేకపోవడంతో ఆయనతోపాటు వార్డు ప్రజలు అభ్యంతరం తెలిపారు. గారపాటి వీధిలో నిర్మించిన డ్రెయిన్ ఓ వైపు 7వ వార్డు పరిధి కాగా మరోవైపు 8వ వార్డు పరిధిలోకి వస్తుంది. దీంతో ఈ డ్రెయిన్‌ను కమిషనర్ పరిశీలించి కాంట్రాక్టర్‌తో చర్చించి పెద్ద కల్వర్టు నిర్మిస్తామని, మిగిలిన పనులు పూర్తి చేయిస్తానని హామీ ఇవ్వడంతో సమస్య సద్దుమణిగింది.

అన్నసమారాధన.. ఆధ్యాత్మిక వారధి

- శరన్నవ రాత్ర ఉత్సవాల్లో నిత్యం అన్నదానాలు
- అమలాపురం శ్రీదేవి ఆలయం వద్ద రోజూ 5 వేల మందికి భోజనం
- ఆధ్యాత్మిక భావనతో అన్న ప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు


అమలాపురం శ్రీదేవి ఆలయం వద్ద అమ్మవారి అన్న ప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు

అమలాపురం టౌన్: గతంలో ఏదైనా దైవ కార్యక్రమం అనంతరం అన్న సమారాధనలు, అన్నదానాలను నిర్వాహకలు ఏర్పాటు చేసే వారు. ఇప్పుడు గణపతి, శరన్నవ రాత్రి ఉత్సవాల్లో ప్రతి రోజూ అన్నదానాలు చేయడం సర్వ సాధరణమైపోయింది. అన్నదానాలు నిర్వహించేందుకు దాతలు ముందుకు రావడంతో ప్రతి గణపతి లేదా విజయ దశమి రోజుల్లో ఆయా ఆలయాలు, చలువ పందిళ్లలో సామూహిక అన్నదానాలను ఏర్పాటవుతున్నాయి. కడుపునిండా భోజనం చేసిన భక్తులు, అనాథలు, పేదలు, యాచకులు అన్నదాతా సుఖీభవ కమిటీ సభ్యులను, దాతలను దీవిస్తున్నారు.

భక్తి భావనతో దాతలు వితరణ

జిల్లా వ్యాప్తంగా పండుగ రోజుల్లో అన్న సమారాధనలు నిర్వహించే సంప్రదాయం ఇప్పుడు సాధారణమైంది. దీని వల్ల భక్తులు ఆధ్యాత్మిక భావనతో అమ్మవార్ల ఆలయాల వద్ద నిర్వహిస్తున్న అన్నదానాలు, అన్న సమారాధల్లో పాల్గొంటున్నారు. జిల్లా కేంద్రం అమలాపురంలో ఈ శరన్నవ రాత్రి మహోత్సవాల సందర్భంగా ఏదో ఒక మండపం వద్ద అన్నదానం జరుగుతోంది. భక్తుల్లో అన్న ప్రసాద స్వీకరణకు ఆలయాల వద్ద క్యూ కడుతున్నారు. ఇక కడు పేదలు, అనాథలు, యాచకులు ఈ తొమ్మిది రోజులూ నిర్వహించే అన్నదానాలతో తమ ఆకలి కడుపులను నింపుకుంటున్నారు. పట్టణంలో ఉన్న దాదాపు 8 వేలకు మందికి పైగా కడు పేదలు, అనాథలు, యాచకులు ఆ ఒక్క పూట అన్నం కోసం సహపంక్తిలో కూర్చుని కడుపు నిండా భోజనం చేస్తున్నారు. చాలా చోట్ల సహపంక్తి భోజనాల్లో అరటి ఆకుల్లో అన్నం వడ్డించి దేవుని ముందు అందరూ సమానులేనన్న సంకేతాన్ని సమాజానికి ఇస్తున్నారు. అమలాపురం పట్టణంలో చిన్న, పెద్ద కలిపి అమ్మ వార్ల ఆలయాలు, దసరా సందర్భంగా దుర్గమ్మను ప్రతిష్ఠించిన చలువ పందిళ్లు 75 వరకూ ఉన్నాయి. ఈ ఆలయాలు, చలువ పందిళ్లకు సంబంధించి కొన్ని చోట్ల తొమ్మిది రోజులూ, మరికొన్ని చోట్ల కొన్ని రోజుల్లో అన్నదానాలు నిర్వహిస్తున్నారు.

సమానత్వానికి సంకేతం.. సహ పంక్తి భోజనం

అమలాపురం పట్టణంలోని శ్రీదేవి అమ్మవారి ఆలయం వద్ద శరన్నవ రాత్రి ఉత్సవాలు తొమ్మిది రోజులూ మధ్యాహ్నం భారీ అన్నదానం జరుగుతోంది. భక్తులు, దాతల సహకారంతో రోజుకు దాదాపు 5 వేల మంది భక్తులు, పేదలు భోజనాలు చేసేలా అన్నదానం నిర్వహిస్తున్నారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 3 గంటల వరకూ భక్తుల అమ్మవారి అన్న ప్రసాదాన్ని స్వీకరిస్తున్నారు. సంపన్నలు, సామాన్యులు, పేదలు అందరూ ఇక్కడ సమానమై సహ పంక్తిలో భోజనాలు చేయడం కనిపిస్తోంది. అమ్మవారి సన్నిధిలో అన్నదానాలు చేసేందుకు దాతలు పోటీ పడుతున్నారు.

> **అంతా దాతల సహకారంతోనే..**
>
> శ్రీదేవి అమ్మవారి సన్నిధిలో భక్తులకు అన్నదానం చేసేందుకు అనేక మంది దాతలు ముందుకు వస్తున్నారు. దాతలు అన్నదానం చేసేందుకు ఉత్సవాల సమయంలో ఒక రోజును సర్దు పాటు చేసేందుకు సతమతమవుతున్నాం. అన్ని దానాల కంటే అన్నదానం మిన్న అనే సహాయ గుణం భక్తుల్లో బాగా పెరగడంతో ఈ పోటీ ఉంటోంది. అధ్యాత్మిక భావనతో అన్నదానం చేసేందుకు దాతలు మరింత ముందుకు వస్తున్నారు.
>
> – గంగాబత్తుల రాంబాబు, చైర్మన్, శ్రీదేవి ఉత్సవ కమిటీ, అమలాపురం

వైద్య విద్య ప్రైవేటీకరణ తగదు


ఆర్‌పీఐ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డీబీ లోక్

అమలాపురం టౌన్: వైద్య విద్యను కూటమి ప్రభుత్వం ప్రైవేటు పరం చేస్తే పేద కుటుంబాల్లో వైద్య విద్యను చదవాలకుంటున్న విద్యార్థుల పరిస్థితి ఏమిటని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పీఐ) రాష్ట్ర అధ్యక్షుడు డీబీ లోక్ ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం కుట్ర వల్ల పేద కుటుంబాల విద్యార్థులకు వైద్య విద్య దూరం అవుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక బీవీ రమణయ్య కాలనీలో శనివారం నిర్వహించిన ఆర్‌పీఐ కార్యకర్తల సమావేశంలో లోక్ మాట్లాడారు. వైద్య విద్యను ప్రైవేటీకరణ చేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ప్రజల క్షమించరని లోక్ పేర్కొన్నారు. వైద్య విద్య ప్రైవేటీకరణను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పూర్తయిన, నిర్మాణ దశల్లో ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రభుత్వం తన కోటరీకి చెందిన వ్యక్తుల గుప్పెట్లో పెట్టేందుకు రంగం సిద్ధం చేసుకుందని ఆరోపించారు. అమలాపురం రూరల్ మండలం సమనస వద్ద నిర్మితమవుతున్న ప్రభుత్వ వైద్య కళాశాలను పనులను వేగవంతం చేయాలని సమావేశం తీర్మానం చేసింది. ఆర్‌పీఐ నాయకుడు ఉండ్రు శ్యామలరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ నాయకులు డి.అశోక్, పి.శ్రీనివాసరావు, మెల్లం సత్యనారాయణ, డి.నాగేశ్వరరావు, చిలకపాటి సాంబశివరావు, కె.వెంకటేశ్వరావు, పి.రవి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ 'అమలాపురం' అనుబంధ విభాగాల అధ్యక్షులు వీరే

అమలాపురం టౌన్: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ పార్టీ అనుబంధ కమిటీలకు అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. నియోజకవర్గం పార్టీ యూత్ వింగ్ అధ్యక్షుడిగా దూడల మణీంద్ర (ఫణి), మహిళా విభాగం అధ్యక్షురాలిగా దొంగ సుధారాణి, రైతు విభాగం అధ్యక్షుడిగా కాండ్రేగుల జవహర్‌లాల్, బీసీ సెల్ అధ్యక్షుడిగా భరణిబాబు, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా గెద్దం కిరణ్‌కుమార్, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా అమలదాసు ఏడుకొండలు, మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా షేక్ ఖ్వాజాబాబు, క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా మొసలి స్వర్ణనరాజు, స్టూడెంట్ వింగ్ అధ్యక్షుడిగా మామిడిశెట్టి సతీష్, పంచాయితీరాజ్ వింగ్ అధ్యక్షుడిగా పొలమూరి బాలకృష్ణ, మున్సిపల్ వింగ్ అధ్యక్షుడిగా కట్టోజు సన్నయ్యదాసు, ఆర్‌టీఐ వింగ్ అధ్యక్షుడిగా నల్లా సూర్య ప్రకాష్, వలంటీర్స్ వింగ్ అధ్యక్షుడిగా మోకా రవి, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడిగా పాట సత్తిబాబు, వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా వుద్దగిరి వీర్రాజు, వీవర్స్ వింగ్ అధ్యక్షుడిగా పాలాటి ఆదినారాయణ, వైఎస్సార్ టీయూసీ అధ్యక్షుడిగా ములపర్తి సత్యనారాయణలు నియమితులయ్యారు. నియోజకవర్గ అంగన్‌వాడీ వింగ్ అధ్యక్షురాలిగా పేరిచర్ల వరలక్ష్మి, లీగల్ సెల్ అధ్యక్షుడిగా కాట్రు చంద్రమోహన్, కల్చరల్ వింగ్ అధ్యక్షుడిగా కడలి సత్యనారాయణ, సోషల్ మీడియా వింగ్ అధ్యక్షుడిగా ఈతకోట శ్రావణకుమార్, ఐటీ వింగ్ అధ్యక్షుడిగా కుంచే సుభాష్ షాలెమ్‌రాజు, దివ్యాంగుల విభాగం అధ్యక్షుడిగా ములపర్తి వెంకటేశ్వరరావు, డాక్టర్స్ వింగ్ అధ్యక్షునిగా పరంశెట్టి శ్రీనివాస్, ఇంటలెక్చువల్స్ ఫోరం అధ్యక్షుడిగా పాము నాగేశ్వరరావు, బూత్ కమిటీస్ వింగ్ అధ్యక్షుడిగా తిక్కా వెంకట ప్రసాదరావు, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడిగా పెయ్యల సాయి, ఆర్టిసన్ సెల్ అధ్యక్షుడిగా చిత్రపు రామకృష్ణ నియమితులయ్యారు. నియోజకవర్గ పార్టీ అనుబంధ కమిటీలకు నూతనంగా నియమితులైన అధ్యక్షులను నియోజకవర్గ పార్టీ కోఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ అభినందించారు.

పట్టా భూముల వద్ద మత్స్యకారుల నిరసన


ఏక్ సాల్ పట్టా భూముల్లోని ఆక్వా చెరువుల వద్ద నిరసన తెలుపుతున్న మత్స్యకార మహిళలు


పట్టాభూముల్లో అనధికారికంగా ఆక్వా సాగు

అల్లవరం: కొమరగిరిపట్నం శివారు నక్కా రామేశ్వరంలో మత్స్యకార మహిళలు పట్టా భూములు అప్పగించాలని, మా పొట్ట కొట్టొదంటూ ఏక్‌సాల్ పట్టా భూముల వద్ద శనివారం నిరసన తెలిపారు. 1994 అప్పటి ఆర్డీఓ ఉషారాణి నేతృత్వంలో 52 ఎకరాల్లో 52 మందికి ఏక్‌సాల్ పట్టా భూములను చేపల సాగు చేసుకోవడానికి కేటాయిస్తే గ్రామంలో కొంతమంది పెద్దలు ఏక్‌సాల్ పట్టా భూములను ఆక్వా రైతులకు లీజుకు ఇచ్చి ఆ డబ్బులను కాజేస్తున్నారని మహిళలు మండిపడ్డారు. ఏక్‌సాల్ పట్టా భూముల లీజులు కనీసం ఒక పైసా కూడా పట్టాదారులకు చేరడం లేదని మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. మత్స్యకార మహిళలకు కేటాయించిన పట్టాభూముల్లో విద్యుత్ చోరీతో అక్రమ ఆక్వా సాగు చేస్తున్నారన్నారు. ఇంత జరుగుతున్నా విద్యుత్‌ఖాధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మత్స్యకార సొసైటీ పట్టాదారుల పేర్లు తొలగించి వారికి అనుకూలమైన పేర్లు నమోదు చేసి అర్హులను మోసం చేస్తున్నారని అన్నారు. లీజు డబ్బులు అడిగితే అక్రమ కేసులు బనాయిస్తున్నారని మహిళలు వాపోయారు. అనేక పర్యాయాలు తహసీల్దార్, మత్స్యశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా కనీసం పట్టించుకోవడం లేదన్నారు. దీనిపై కలెక్టర్ స్పందించి ఆక్వా రైతుల ఆక్రమణలో ఉన్న ఏక్ సాల్ పట్టా భూములను స్వాధీనం చేసుకుని అర్హులకు అప్పగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార నాయకుడు చెక్కా ఆంజనేయులు, పంతాడి సత్యనారాయణ, అంగాడి విష్ణు, మల్లాడి నరేష్, అంగాడి గోవిందు, కోపనాతి కాళికేశ్వరీ, కర్రి ధనలక్ష్మీ, అంగాడి అన్నపూర్ణ, వైదాడి ధనలక్ష్మీ, అంగాడి మంగాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యమే కుటుంబ సంక్షేమం

అల్లవరం: మహిళల ఆరోగ్యమే కుటుంబ సంక్షేమని తద్వారా సమాజం ఆరోగ్యంగా ఉంటుందని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అన్నారు. అల్లవరం సామాజిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ్ నారీ- సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాకేష్ మాట్లాడుతూ ఇటీవల ఎక్కువగా మహిళలు వివిధ రకాల క్యాన్సర్ల బారిన పడుతున్నారని తెలిపారు. మహిళల ఆరోగ్యాన్ని కాపాడుకోవల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ వైద్య శిబిరం ద్వారా 183 మందికి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కొనుకు గౌతమి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాల్ల దొరబాబు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ బండిగుప్పాపు సత్తిబాబు, సర్పంచ్ బొమ్మి బాలవేణి, ఎంపీటీసీ మానిక, జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ కార్తీక్, డాక్టర్లు పాల్గొన్నారు.

జీఎస్టీ 2.0 ప్రయోజనాలపై విస్తృత ప్రచారం


సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నిషాంతి

అమలాపురం రూరల్: పేద, మధ్యతరగతి వర్గాలకు బహుమతిగా ఎన్డీఏ ప్రభుత్వం ఇచ్చిన జీఎస్టీ 2.0 ప్రయోజనాలను క్షేత్రస్థాయికి వరకు చేర్చడంలో అధికారులు నెలరోజుల పాటు కీలక పాత్ర పోషించాలని జేసీ టి.నిషాంతి ఆదేశించారు. శనివారం జీఎస్టీ 2.0 సూపర్ జీఎస్టీ సూపర్ సేవ్ పథకం నెలరోజుల ప్రచార కార్యక్రమాల ప్రచార అంశాలపై జిల్లాస్థాయి అధికారులకు ఆమె దిశా నిర్దేశం చేశారు. సామాన్య ప్రజలకు సహాయకంగా కొత్త జీఎస్టీ భారం తగ్గడం వల్ల వినియోగం పెరిగే అవకాశం ఉందని జేసీ అన్నారు. సూపర్ జీఎస్టీ -సూపర్ సేవింగ్స్ ప్రచారం అక్టోబర్ 19 వరకు కొనసాగుతుందన్నారు. నోడల్ విభాగంగా కమర్షియల్ టాక్స్ అధికారి జగన్ మోహన్ రెడ్డి వ్యవహరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ కే. మాధవి, డీఎస్ఓ అడపా ఉదయభాస్కర్, డీఈవో షేక్ సలీం బాషా, వివిధ శాఖలకు చెందిన జిల్లాస్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు నిర్మల్ కుమార్, రంగారావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పడి పూజ

తాళ్లరేవు: శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా స్థానిక ప్రధాన రహదారిలో వేంచేసియున్న కనకదుర్గమ్మ ఆలయం వద్ద శనివారం భవానీల పడి పూజను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధి భూసారపు శ్రీనివాసరావు పర్యవేక్షించారు. కోరంగిలోని శ్రీ దుర్గా పంచాయతన ఆలయంలో అమ్మవారిని శనివారం శ్రీ లలితా త్రిపుర సుందరిగా అలంకరించి పూజలు చేసారు.


తాళ్లరేవు ప్రధాన రహదారిలోని కనకదుర్గ ఆలయం వద్ద పడిపూజ చేస్తున్న భవానీ మాలధారులు

వైఎస్సార్ సీపీ నేతలకు సత్కారం


పార్టీ నాయకులను సత్కరిస్తున్న రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, సంసాని నాని

అమలాపురం రూరల్: నియోజకవర్గంలో ఇటీవల పదవులు పొందిన వైఎస్సార్ సీపీ నేతలు నాయకులను పలువురు ఘనంగా సత్కరించారు. భట్నవెల్లిలో మాజీ మంత్రి విశ్వరూప్ నివాసంలో శనివారం పదవులు పొందిన సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి ఉండ్రు బాబ్జీ, బూత్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి ఉండ్రు వెంకటేష్, మున్సిపల్ విభాగం సంయుక్త కార్యదర్శి గొవ్వాల రాజేష్, ఇంటెలెక్చువల్ ఫోరం రాష్ట్ర కార్యదర్శి గుత్తుల ఈశ్వర ప్రసాద్‌ను పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ముమ్మిడివరం, మండపేట నియోజకవర్గాల పరిశీలకుడు చెల్లుబోయిన శ్రీనివాసరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు సంసాని నాని ఆధ్వర్యంలో నాయకులు సత్కరించారు. జెడ్పీటీసీలు పందిరి శ్రీహరిరామ్‌గోపాల్, కొనుకు గౌతమి, నాయకులు పాగాకు శ్రీను, ఒంటిద్దు వెంకయ్యనాయుడు, కూడుపూడి భారత్, దొంగ చిన్నా ,పాటి రవి, కౌన్సిలర్ల నాగారపు వెంకటేశ్వరరావు, సుంకర సుధ పాల్గొన్నారు.

కరుణా తరంగిణి.. లలితా త్రిపుర సుందరీదేవి


అమలాపురం కామాక్షీ ఏకామ్రేశ్వరీదేవి సన్నిధిలో సామూహిక కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు


శ్రావణిదుర్గాదేవి ఆలయం వద్ద కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు


పల్లవారిపాలెంలో లలితా త్రిపుర సుందరి దేవి అలంకరణలో అమ్మవారు


లలితా త్రిపుర సుందరీ దేవిగా అమలాపురం హౌసింగ్ బోర్డు కాలనీలోని కల్యాణదుర్గ అమ్మవారు

అమలాపురం టౌన్: విజయ దశమి శరన్నవ రాత్ర మహోత్సవాల్లో భాగంగా ఆరో రోజు శనివారం అమలాపురంలోని పలు ఆలయాల్లోని అమ్మవార్లు కరుణకు ప్రతీక, శక్తిస్వరూపిణి అయిన లలిత త్రిపుర సుందరీ దేవిగా అలంకృతమై భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక శ్రీదేవి అమ్మవారి ఆలయం, హౌసింగ్ బోర్డు కాలనీలోని కల్యాణ దుర్గ ఆలయంతో పాటు పట్టణంలోని పలు ఆలయాల్లోని అమ్మవార్లు లలితా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

వైభవంగా ఉత్సవాలు

పట్టణ విశ్వ బ్రాహ్మణ స్వర్ణకార సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక గోల్డ్ మార్కెట్‌లోని శ్రీ కామాక్షీ ఏకామ్రేశ్వరీదేవి ఆలయంలో దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారు లలితా త్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చారు. అమ్మ వారి సన్నిధిలో శనివారం మహిళలు కమిటీ ఆధ్వర్యంలో సామూహిక కుంకుమ పూజ నిర్వహించారు. పట్టణ విశ్వ బ్రాహ్మణ, స్వర్ణకార సంక్షేమ సంఘం ప్రతినిధులకు భక్తులకు సేవలు అందించారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

ముమ్మిడివరం: నియోజకవర్గంలో దసరా శరన్నవ రాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆరవ రోజు శనివారం అమ్మవారు లలితా త్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శన మిచ్చారు. ముమ్మిడివరంలో కుమ్మర్లవీధి, మార్కెట్ సెంటర్, మెయిన్ రోడ్డు, రాజుపాలెం, క్రాపచింతలపూడిలోని అమ్మవారి ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

సహస్ర కుంకుమార్చన

కాట్రేనికోన: దసరా ఉత్సవాల సందర్భంగా చింతలమెరకలోని శ్రీ విజయలక్ష్మి దుర్గ ఆలయంలో శనివారం సహస్ర కుంకుమార్చన ఘనంగా నిర్వహించారు.

కనకాలపేటలో..

యానాం: కనకాలపేట గ్రామంలో కొలువైన శ్రీ శ్రావణిదుర్గాదేవి ఆలయం వద్ద శనివారం ఘనంగా లక్ష కుంకుమార్చన నిర్వహించారు. యానాం పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

తీర ప్రాంతాల్లో వైభవంగా ప్రారంభమైన అమ్మవార్ల జాతర

కాట్రేనికోన: సముద్ర తీర ప్రాంత పల్లం, చిర్రయానం,గచ్చకాయలపోర, లోతుకాలువ తదితర గ్రామాల్లో శనివారం అమ్మవారి జాతర మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇతర ప్రాంతాల్లో ఉంటున్న కుటుంబ సభ్యులు, బంధువులు స్వగ్రామాలకు చేరుకున్నారు.

వేంకటేశ్వరస్వామికి కరెన్సీ నోట్లతో అలంకరణ


కరెన్సీ నోట్ల అలంకరణలో వేంకటేశ్వరస్వామి

అమలాపురం టౌన్: పెళ్లిళ్ల వెంకన్నగా పేరుగాంచిన అమలాపురం వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామి వారు విజయ దశమి సందర్భంగా రూ.2.60 లక్షల కొత్త కరెన్సీ నోట్లతో శనివారం అలంకృతయ్యారు. దాత రేపాక సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ అలంకరణ విజయ దశమి అక్టోబర్ 2వ తేదీ వరకూ కొనసాగుతుందని దేవస్థానం ఈవో యర్రా వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం నుంచి ఆరు రోజలపాటు కరెన్సీ నోట్ల అలంకరణతో స్వామివారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ కంచిపల్లి అబ్బులు, ధర్మకర్తలు, దాత సత్యనారాయణ మూర్తి స్వామివారికి పూజలు చేశారు.

సాయుధ రిజర్వు కార్యాలయంలో ఎస్పీ తనిఖీ

అమలాపురం టౌన్: జిల్లా సాయుధ రిజర్వు కార్యాలయాన్ని, సెంట్రల్ క్రైమ్ స్టేషన్లను ఎస్పీ రాహుల్ మీనా శనివారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా కార్యాలయాల్లోని రికార్డులను ఆయన పరిశీలించారు. సాయుధ రిజర్వు పోలీసులు, సెంట్రల్ క్రైమ్ స్టేషన్ల పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని ఎస్పీ సూచించారు. రిజర్వు ఇన్‌స్పెక్టర్, ఎస్సైలతోపాటు అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ పాల్గొన్నారు.



అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారు

వీరేశ్వరస్వామి పాలకవర్గం రేపు ప్రమాణ స్వీకారం

ఐ.పోలవరం: మురమళ్ల శ్రీ భద్రకాళి సమేత వీరేశ్వర స్వామి ఆలయ నూతన ధర్మకర్త మండలి సభ్యుల ప్రమాణ స్వీకారం ఈనెల 29వ తేదీ ఉదయం నిర్వహించనున్నట్టు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కార్యనిర్వాహణాధికారి వి.సత్యనారాయణ శనివారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, దేవదాయశాఖ కమిషనర్ ఉత్తర్వులను అనుసరించి ఎంపిక చేసిన వారితో ప్రమాణం చేయిస్తామన్నారు. సభ్యులుగా దాట్ల రామకృష్ణం రాజు, పెద్దింటి మారుతి శ్రీవాణి, పెన్మత్స రామరాజు, త్సవటపల్లి నాగేంద్ర రావు, కర్రి చంద్రశేఖర్, శ్రీ విత్తనాల సత్యనారాయణ, శ్రీమతి గంగుల జయ లక్ష్మీ, శ్రీమతి గొల్లవిల్లి సునీత, పాటి సీతా మహాలక్ష్మి, మద్దాల వెంకటేశ్వర రావు, ఎక్స్ అఫీషియోగా పేటేటి వీర వెంకట సుబ్బారావు రెండేళ్ల కాల పరిమితితో ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు తెలిపారు. అనంతరం చైర్మన్ ఎన్నిక జరుగుతుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజుతో పాటు పలువురు ప్రముఖులు కార్యక్రమానికి హాజరుకానున్నారు.

బాలకృష్ణ అనుచిత వ్యాఖ్యలు దారుణం

తాళ్లరేవు: శాసనసభలో ఎమ్మెల్యే బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయని ముమ్మిడివరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా అధ్యక్షుడు పందిరిపల్లి రాజేష్ ఖండించారు. శనివారం ఆయన తాళ్లరేవులో మాట్లాడుతూ రాష్ట్రంలో 40 శాతానికిపైగా ఓటు బ్యాంకుతో ప్రజాభిమానం కలిగిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని దూషించడం తగదన్నారు. సినీ పరిశ్రమలో నెలకొన్న సమస్యలను వివరించడానికి జగన్‌ను కలిసిన సినీ హీరో, కేంద్ర మాజీ మంత్రి చిరంజీవిని ఉద్దేశించి వ్యంగ్యంగా మాట్లాడటం దారుణమన్నారు. సంస్కారం లేకుండా మాట్లాడిన బాలకృష్ణను శాసనసభ నుంచి సస్పెండ్ చేయాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేసిన వైస్ జగన్‌ను దూషించిన బాలకృష్ణ బహిరంగ క్షమాపణ చెప్పాలని రాజేష్ డిమాండ్ చేసారు.

దొంగ ఓట్లకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ

అమలాపురం టౌన్: దేశ వ్యాప్తంగా దొంగ ఓట్లకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ ఉద్యమంలో భాగంగా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ స్థానిక గడియారం స్తంభం సెంటరులో శనివారం నిర్వహించారు. నియోజకవర్గ పార్టీ కో ఆర్డినేటర్ అయితాబత్తుల సుభాషిణి, పట్టణ పార్టీ అధ్యక్షుడు వంటెద్దు బాబి, ఏఐసీసీ, పీసీసీ నాయకులు పాల్గొన్నారు.